## ఆటా కథల పోటీలో మొదటి బహుమతి సాధించిన కథ



# మరో దృశ్యం

-సలీం

ఆదివారం మధ్యాహ్న వేళ...

గాలి స్తంభించినట్లు- లాకర్ గదిలో బంధించినట్లు ఉక్కపోత...

అన్నం తింటున్న సాయన్న భార్యవైపు చూసి ''కొద్దిగా ఫ్యాన్ వెయ్యి'' అన్నాడు. ఆమె అదో మాదిరిగా చూసింది. ''లైట్ బిల్లు పోయిన్నెల నాలుగొందలొచ్చింది. మర్చేపోయావా'' అంది.

''పర్లేదులే. మరీ ఉక్కగా ఉంది. అన్నం సయించటంలేదు. కొద్దిసేపు వేయి'' అన్నాడు బతిమాలుకుంటున్న ధోరణిలో. అతని భార్య మనస్తత్వం తెలుసు. బాగా డబ్బు యావ. పైసా ఖర్చుపెట్టాలన్నా ప్రాణం గిల్లార్చుకుపోతుంది. తనెంత రెక్కలు ముక్కలు చేసుకుని సంపాయించినా, ''ఇంతేనా. ఈ సంబడానికేనా పొద్దస్తమానూ పని చేస్తావుంటావు''అంటూ ఈసడించుకుంటుంది.

ఆమె అయిష్టంగా స్విచ్ వేసింది- మొహం నిండా పులిమినట్లు నిరసన...

ఫ్యాన్ వూపందుకోగానే ''హమ్మయ్య'' అనుకున్నాడు. చెమట పట్టిన శరీరానికి గాలి తగలగానే ప్రాణం లేచి వచ్చినట్లనిపించింది.

''మజ్జిగెయ్యి'' అన్నాడు.

పల్చటి నీళ్ళ మజ్జిగ కంచంలో పోసింది.

''ఏమిటీ మరీ నీళ్ళ నీళ్ళగా ఉన్నాయి?''

''నీ సంపాదనకి చిక్కటి మజ్జిగ, పెరుగు వస్తాయనుకుంటున్నావా?'' అందామె.

మారు మాట్లాడకుండా కంచంలో మిగిలిన అన్నాన్ని మజ్జిగలో కలుపుతున్నప్పుడు బైటినుంచి కేక విన్పించింది.

సాయన్న కంచం ఎత్తి మజ్జిగ గటగటా తాగేసి, చెయ్యి కడుక్కుని బైటికొచ్చాడు. అరుణోదయా అపార్ట్‌మెంట్స్‌లో పనిచేసే వాచ్‌మన్ నిలబడి ఉన్నాడు. ''ఫ్లాట్లల్ల కరెంటు పోయింది. సారు నిన్ను బేగీ రమ్మన్నడు.''

సాయన్న ఉండే ఇంటి చుట్టుపక్కల రెండుమూడు అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. డబ్బులెక్కువ అడగడు. పని సక్రమంగా చేస్తాడు కాబట్టి కరెంటు పనేదైనా ఉంటే సాయన్నకు కబురందుతుంది.

చొక్కా తొడుక్కుని, పని ముట్లు పట్టుకుని వాచ్‌మన్ వెంట బయల్దేరాడు.

* * *

అరుణోదయా అపార్ట్‌మెంట్స్ సెక్రటరీకి చాలా అసహనంగా ఉంది. మూడేళ్ళ క్రితం వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. పిల్లలిద్దరూ అమెరికాలో సెటిలైనారు. రిటైర్మెంట్ డబ్బులమీద వచ్చే వడ్డీతో హాయిగా శేష జీవితాన్ని గడిపేయాలనుకున్నాడు. కానీ ప్రభుత్వం బ్యాంకు డిపాజిట్ల మీద వడ్డీ రేటుని సగానికి సగం తగ్గించి తన ఆశల్ని అడియాసలు చేసింది.

అందుకే వెల్ఫేర్ అసోసియేషన్ ఎలక్షన్లలో నిలబడి సెక్రెటరీగా గెలిచాడు. వ్యాపకానికి వ్యాపకం- డబ్బుకి డబ్బు. అరవై ఫ్లాట్లు... నెలకి మెయింటెనెన్స్ కింద ఐదు వందలు వసూలు చేస్తారు... అంటే నెలకి ముప్ఫై వేలు. చేయని ఖర్చులు రాసేయటం- చేసిన ఖర్చులు ఎక్కువ చేసి చూపటం లాంటి మెళకువలు అతనికి బాగా వంటబట్టాయి.

గంట క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌లో పెద్దగా శబ్దం వచ్చి మంటలు లేచాయి. కరెంటు పోయింది. సెక్రెటరీ అయిన పాపానికి తను అరవై కుటుంబాలకు సమాధానం చెప్పాలి. తల నొప్పి వ్యవహారం... నిజంగానే బాగా ఉక్కపోతగా ఉంది... చిరాగ్గా ఉంది. వర్షం పడ్తుందేమో తెలీదు. దిగపోత చెమటలు. అసలే కాంక్రీట్ జంగిల్లాంటి ఫ్లాట్లు. యిళ్ళల్లో అందంకోసం పెంచుకుంటున్న ఒకటీ అరా క్రోటన్ మొక్కలు తప్ప పచ్చదనం కరువైన రాతి వనం...

సాయన్నకోసం ఎదురుచూస్తూ మరింత అసహనానికి లోనైనాడు. సాయన్న అయితే ఇచ్చినంత పుచ్చుకుంటాడు. రెండొందలిచ్చి వెయ్యి ఖర్చు రాసేస్తే సరి.

సాయన్నని చూడగానే ''ఇంతాలస్యమైందేం?'' అన్నాడు. కంఠంలో కరెంటు లేనందువల్ల కలుగుతున్న అసౌకర్యాన్ని ధ్వనింపచేస్తూ.

''అన్నం తినొస్తున్నా సారూ''అంటూనే క్షణంలో సునాయాసంగా ట్రాన్స్‌ఫార్మర్ పైకి ఎక్కాడు. ''జర జల్దిచేయి'' ఆర్డర్ జారీచేసి సెక్రెటరీ తన ఫ్లాట్‌కెళ్ళిపోయాడు.

* * *

శ్రీనివాస్‌కి చాలా విసుగ్గా ఉంది. అతనో టీవి ఛానెల్లో కెమెరామన్‌గా పనిచేస్తున్నాడు. మంచి డాక్యుమెంటరీ తీయాలని, అది అవార్డు వచ్చే లెవెల్లో ఉండాలని అతని కోరిక. ఏ అంశం మీద తీయాలా అని తీవ్రంగా ఆలోచించాడు.

బాల కార్మికులు, చెత్తకుప్పల్లోంచి చిత్తు కాగితాలేరుకునే వాళ్ళు, బాల్యంలోనే వేశ్యాగృహాలకు అమ్ముడుపోయిన

అభాగినులు, అరబ్బు షేకులు మిఠాయి పొట్లాల్లా కొనుక్కెళ్తున్న అమీనాల కథలు... ఇలాంటివన్నీ ఆల్రెడీ కవర్ చేశారు. కొత్త విషయం తీయాలి. చాలా కొత్తగా, అద్భుతంగా ఉండాలి.

ఈమధ్య జాగ్రఫీ ఛానెల్‌లో ఓ పులి జింకని వెటాడ టాన్ని అద్భుతంగా చిత్రీకరించడం చూసాడు. పులి పంజా నించి ప్రాణభయంతో తప్పించుకుని పరుగెత్తుతున్న జింక... ముప్పుతిప్పలు పెట్టిన తన ఆహారాన్ని ఎట్లాగయినా చేజిక్కించుకోవాలనే పట్టుదలతో వేగం పెంచిన పులి... పులి నోటికి అందే ముందుకూడా జింక పడిన తాపత్రయం... దాని కళ్ళలో మృత్యు భీతి... పులి దాని మెడ కొరికి గిలగిలా కొట్టుకుంటున్న జింకని విజయగర్వంతో లాక్కెళ్ళటం... అదంతా స్లోమోషన్‌లో చిత్రీకరించాడు.

అలాంటిదేమైనా చేయాలని అతని కోరిక. కెమేరా కన్నుకి ఇప్పటివరకూ దొరకని దృశ్యం. సిగరెట్లమీద సిగరెట్లు కాల్చేస్తూ మేథోమథనంలో మునిగి ఉన్నప్పుడు పెద్ద శబ్దం వచ్చింది. ఉలిక్కిపడి కిటికీలోంచి శబ్దం వచ్చిన వైపుకు చూసాడు. తమ ఫ్లాట్‌కి ఎదురుగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ లోంచి పొగలొస్తున్నాయి. కరెంటు పోయింది. ఉక్కగా ఉంది. కిటికీ రెక్కలు బార్లాతెరిచాడు. చికాగ్గా ఉంది. ఆలోచనలు సవ్యంగా రావడంలేదు.

కొద్దిసేపు అటూ ఇటూ పచార్లు చేశాడు. పడుకోవడానికి ప్రయత్నించాడు. నిద్ర పట్టలేదు. ట్రాన్స్‌ఫార్మర్ ఎప్పటికి బాగౌతుందో తెలీటంలేదు. మూడో ఫ్లోర్‌లో ఉన్న సెక్రెటరీకి ఫోన్ చేశాడు. "ఇది ఇరవై నాలుగో ఫోన్"అని జవాబొచ్చింది విసురుగా...గంట గడిచింది.

కిటికీలోంచి బైటికి చూశాడు. సాయన్న చులాగ్గా ట్రాన్స్‌ఫార్మర్‌పైకి ఎక్కటం కన్పించింది. ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోతే సాయన్న ఏం చేయగలడో అతనికి అర్థంకాలేదు. చిన్న రిపేరేమైనా ఉంటే నాలుగు డబ్బులొస్తాయన్న ఆశ కావచ్చు... బతుకు పోరాటం... ఇలాంటి టైటిల్ పెట్టి డాక్యుమెంటరీ తీస్తేనో అనే ఆలోచన వచ్చింది. వెంటనే బ్యాటరీ లోడ్ చేసిన హ్యాండిక్యామ్ ఆన్‌చేసి సాయన్న మీద జూమ్ చేశాడు.

సాయన్న పదో తరగతి పరీక్షలు తప్పాక చదువిక అబ్బదని అర్థమై ఎలక్ట్రీషియన్ పని నేర్చుకున్నాడు. అతనికిప్పుడు దాదాపు పదేళ్ళ అనుభవం ఉంది. అతను ఎలక్ట్రికల్ ఇంజనీరు కాకున్నా వాడి బాబులా సమస్య ఏమిటో చిటికెలో పట్టేయగలడు. దాన్ని చాకచక్యంగా పరిష్కరించనూ గలడు. ఎక్కడ ముట్టుకుంటే ముప్పో-ఎక్కడ పట్టుకుంటే తప్పో అతనికి బాగా తెలుసు.



సాయన్న చేతులు చకచకా కదుల్తున్నాయి. వీలైనంత తొందరగా లోపం కనుక్కోవాలన్న ఆతురత... మరోచోట రిపేరు పనుందని కబురొచ్చింది. ఈ పని పూర్తిచేసుకుంటే అక్కడికి వెళ్ళొచ్చన్న ఆశ... అతనికెందుకో ఆ క్షణం భార్య గుర్తొచ్చింది. ఆమె గయ్యాళితనం... డబ్బుమీది వ్యామోహం గుర్తొచ్చాయి. ఆమె మాటలు... ఎలక్ట్రిక్ షాకుల్లా... వేల వోల్టుల షాకులు...

సాయన్న చేతులు చకచకా కదుల్తున్నాయి. వీలైనంత తొందరగా లోపం కనుక్కోవాలన్న ఆతురత... మరోచోట రిపేరు పనుందని కబురొచ్చింది. ఈ పని పూర్తిచేసుకుంటే అక్కడికెక్కడావెళ్ళొచ్చన్న ఆశ... అతనికెందుకో ఆ క్షణం భార్య గుర్తొచ్చింది. ఆమె గయ్యాళితనం... డబ్బుమీది వ్యామోహం గుర్తొచ్చాయి. ఆమె మాటలు... ఎలక్ట్రిక్ షాకుల్లా... వేల వోల్టుల షాకులు...

పరాకులో చేయి అదుపుతప్పింది. తాక కూడనిచోట తాకింది. సాయన్న పెద్దగా కేకపెట్టి ఎగిరిపడ్డాడు. చేతినెవరో పదునైన, బలమైన కత్తితో నరికేసినట్లు... శరీరాన్నెవరో రేణువులుగా చెక్కుతున్నట్లు... ట్రాన్స్‌ఫార్మర్‌కున్న అడ్డకమ్మీలమీద బోర్లాపడిపోయాడు.

ఆ కేక వినగానే శ్రీనివాస్ అలర్ట్ అయినాడు. కొన్ని వేల వోల్టుల షాక్... బతకడు... సాయన్నమీద జూమ్ చేశాడు. శ్వాస తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. మరణ వేదన... చావుకి అతి సమీపంగా ఉన్నాడు. ఉండీ ఉండీ అతని శరీరం కుదుపునకు లోనవుతోంది. మరణ దృశ్యం అని టైటిల్ పెడితే... ఓ అద్భుతమైన, అపురూపమైన దృశ్యాన్ని చిత్రీకరిస్తున్నంత శ్రద్ధగా అతను రికార్డింగ్‌లో లీనమైనాడు.

ఫ్లాట్లలోని కొంతమంది వ్యక్తులు బైటికొచ్చి ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర గుమికూడారు. సెక్రెటరీ పరుగుపరుగున వగరుస్తూ వచ్చాడు. తెగిన గాలిపటంలా ట్రాన్స్‌ఫార్మర్ కమ్మీలమీద వేలాడుతున్న సాయన్నను చూడగానే అతనికి బీపి పెరిగిపోయింది. ఏదో నాలుగు డబ్బులు మిగుల్తాయి కదా అనుకుంటే ఇదేం పీడాకారం అనుకున్నాడు. కళ్ళు చిట్లించి చూశాడు. సాయన్న శరీరంలో ఏ రకమైన కదలికా లేదు. ఇదేదో పోలీసు కేసయ్యేలా ఉంది అనుకుంటుండగా, "మొదట ఎలక్ట్రిసిటీ డిపార్ట్‌మెంట్‌కి ఫోన్ చేయండి. వాళ్ళు పవర్ సప్లై ఆఫ్ చేయకుండా వాణ్ణి కిందికి దింపటం కష్టం"అన్నారెవరో. అతను ఆదుర్దాగా ఫోన్ చేయడానికి పరుగెత్తాడు.

★ ★ ★

కరెంట్ ఆఫీసులో ఆనాటి పేపర్ తిరగేస్తూ కూచున్నాడు సాంబమూర్తి. అతనికి చిరాగ్గా ఉంది. పేరైతే కరెంటాఫీసే కాని పైనున్న ఫ్యాన్ ఇక్ష్వాకుల కాలంనాటిది. ఏ క్షణంలో అయినా వూడి నెత్తిమీద పడేలా టక్కు టక్కుమంటూ శబ్దంచేస్తూ తిరుగుతోంది. గాలి తగలటం లేదు. ఉక్కగా ఉంది.

ఇంకో రెండు గంటలు కూచుంటే డ్యూటీ అయిపోతుంది. తన రిలీవర్ వెంకన్న. వాడసలే తాగుబోతు వెధవ. మస్తుగా తాగి ఏ రోడ్డు పక్కనో పడిపోతాడో ఏమో? అసలే ఈరోజు తనకు చాలా ముఖ్యమైన రోజు. చుట్టాల పెళ్ళికని పిల్లల్ని తీసుకుని పెళ్ళాం వూరెళ్ళింది. సాయంత్రం శ్యామలని ఇంటికి రమ్మన్నాడు. తను ఆరింటికల్లా ఇంట్లో ఉండకపోతే తాళంచూసి శ్యామల తిరిగెళ్ళిపోయే ప్రమాదం ఉంది.

శ్యామలకు మల్లెపూలంటే ఇష్టం. వెళ్ళేప్పుడు మూడు మూరల పూలు తీస్కోవాలి. క్వార్టర్ బాటిల్ విస్కీ, రెండు పొట్లాలు చికెన్ బిర్యాని మర్చిపోకూడదు.

ఫోన్ మోగింది.

"ట్రాన్స్‌పార్మర్ పైకెక్కి ఓ ఎలక్ట్రీషియన్ కుర్రాడు షాక్ తగిలి పడిపోయాడు". అది వినగానే సాంబమూర్తి నిటారుగా కూచున్నాడు.

"ఎక్కడా?"

"ట్రాన్స్‌ఫార్మర్ పైనే.., వెల్లకిలా పడిపోయి వేలాడుతున్నాడు."

"నేనడిగింది ఏరియా ఎక్కడని" అతని గొంతులో అసహనం.

"అమీర్‌పేటలోని అరుణోదయా అపార్ట్‌మెంట్స్‌లో."

వెంటనే సాంబమూర్తి రిలాక్సయినాడు. "ప్రైవేట్ వ్యక్తుల్ని ట్రాన్స్‌ఫార్మర్ రిపేరుకి పిలవకూడదని తెలీదా" అన్నాడు ఒకింత కోపంగా.

"అయన్నీ తర్వాత... ఆ కుర్రాడు బతికున్నాడో లేదో కూడా తెలీటంలేదు. వాణ్ణి కిందికి దింపాలి. మీరు వెంటనే ఈ ఏరియాలో పవర్ ఆఫ్ చేయండి."

"కంప్లెయింట్ రాసుకున్నాడు. నెంబర్ ముప్పయి ఆరు. వర్కర్లందరూ కంప్లెయింట్లు అటెండ్ కావడానికి బైటికెళ్ళి ఉన్నారు. రాగానే మీ కాంప్లెక్స్‌కి పంపిస్తాను."

(మిగతా 12వ పేజీలో)

## రచయిత పరిచయం



కవిత, కథ, నవలా ప్రక్రియల్లో ప్రవేశమున్నా కథలంటేనే ఎక్కువ ఇష్టం. ఇప్పటివరకు మూడు కథాసంపుటాలు 'స్వాతి చినుకులు', నిశ్శబ్ద సంగీతం', 'రూపాయి చెట్టు' వెలువడ్డాయి. రెండు నవలలు 'జీవన్మృతులు', 'వెండిమేఘం', ఓ కవితా సంపుటి 'నీలోకి చూసిన జ్ఞాపకం' వెలువడ్డాయి. మూడోనవల 'కాంచనమృగం' ఆటావారి నవలల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైంది.

వాస్తవిక జీవితాన్ని చిత్రీకరించటంతో పాటు సమాజ హితానికి పనికి వచ్చే రచనలు చేయటం ఇష్టం. మానవతా వాదాన్ని మించిన వాదం లేదని నమ్ముతాను.

*2002 సంవత్సరానికి కథా ప్రక్రియలో తెలుగు యూనివర్శిటీవారి 'ధర్మనిధి పురస్కారం', 2003 సంవత్సరానికి అధికార భాషా సంఘం నుంచి 'భాషా పురస్కారం' అందుకున్నాను. ప్రతిష్టాత్మకమైన ఆటావారి కథల పోటీల్లో నా కథకు మొదటి బహుమతి రావటం రచయితగా నా బాధ్యతను మరింత పెంచిందని భావిస్తున్నాను.*

అడ్రస్
సయ్యద్ సలీం,
ప్లాట్ నెం. 306, జెబి అపార్ట్‌మెంట్స్,
దోమలగూడ, హైదరాబాద్

(9వ పేజీ తరువాయి)

"నేను ట్రాన్స్‌ఫార్మర్ రిపేరు గురించి మాట్లాడటంలేదు. మీరీ లైన్లో కరెంట్ ఆఫ్‌చేస్తే మేము బాడీని దింపుకుంటాం."

"నేను చెప్పేదీ అదే. కంప్లెయింట్ రాసుకున్నాకదా. వీలు వెంబడి అటెండ్ అవుతారు."

"వీలంటారేమిటీ... మనిషి చావుబతుకుల్లో ..." అంటుండగానే విసురుగా ఫోన్ పెట్టేశాడు సాంబమూర్తి.

గవర్నమెంటు ఉద్యోగి అంటే ప్రతి అడ్డమైన వెధవకీ లోకువే. వాడేదో నా బాస్ అయినట్లు... చెప్పగానే పరుగెత్తుకుంటూ వెళ్ళాలా... ఎంత లోకువైపోయింది బతుకు... అనుకున్నాడు.

★ ★ ★

వాచ్‌మన్ ద్వారా కబురందుకున్న సాయన్న భార్య వలవలా ఏడ్చుకుంటూ వచ్చింది. అసలే పోలీస్ కేసవుతుందేమోనని భయపడ్తున్న సెక్రెటరీకి ఆమె పెడ్తున్న శోకాలు గుండెల్లో దడ పుట్టిస్తున్నాయి.

"నాకిపుడు దిక్కెవరు దేవుడోయ్... నన్ను అన్యాయం చేసి పోయావా... నా అతీగతీ పట్టించుకునే వాళ్ళింకెవరున్నారు తండ్రీ" అంటూ రాగాలు తీస్తూ ఏడుస్తోందామె.

సెక్రెటరీ వైపు చూస్తూ "నువ్వు పిలవనంపగానే పరుగెత్తుకుంటూ వచ్చాడు సారూ... ఆడి చావు ఇక్కడ కాపేసిందని తెల్సుకోలేకపోయాడు సారూ" అంది.

ఆ మాటలకు గతుక్కుమన్నాడతను. మరికొద్ది సేపాగితే 'నీవల్లనే చచ్చాడు సారూ' అనేలా ఉందనుకున్నాడు. వేగంగా లెక్కలు వేసుకున్నాడు. పోలీసు కేసై వేలకువేలు పోలీసోళ్ళకు ధారపోయటంకంటే ఎంతోకొంత ఆశచూపి దీని నోరు కుట్టేయటమే మేలనిపించింది. చీపు కూడాను... అరవై ఫ్లాట్లు... ఒక్కొక్కరు ఐదొందలేసుకున్నా ముప్పయి వేలు... మొగుడు చచ్చి ముండమోసిన సాయన్న పెళ్ళాం దీనావస్థ అనే సెంటిమెంటుతో కొడితే సరి... డబ్బులు వాటంతటవే రాల్తాయి...అని ఆలోచించాడు.

ఆమె దగ్గరకెళ్ళి సముదాయిస్తూ "నువ్వేమీ బెంగపడకు. సాయన్న చాలా మంచివాడు. మన కాంప్లెక్స్‌లో ప్రతి వారికీ తల్లో నాలుకలా మెలిగాడు. తలో కాస్త వేసుకుని ఓ పాతిక ముప్పయివేల వరకూ వసూలుచేసి నీకిప్పిస్తాను. దాంతో ఏదైనా వ్యాపారం చేసుకుని బతుకుదువ్వగాని" అన్నాడు.

ఆ మాటలు వినగానే ఆమె కళ్ళు ఓ క్షణం ఆశతో మెరిశాయి. దాన్ని కప్పి పుచ్చుకుంటూ "ఓరి దేవుడా... నా పసుపు కుంకుమల్ని తీస్కెళ్ళిపోయావా" అంటూ పెద్దగా రోధించసాగింది.

★ ★ ★

"థూ దీనవ్వ... ఫైసల్ రాని బాడకవ్ కేసుల్కి మనం తప్ప దొర్కరాగీయస్సై నా కొడుక్కి" పోలీస్‌స్టేషన్ బైటికి రాగానే తన పక్కనున్న కానిస్టేబుల్‌తో అని, మరో పక్కన తుపుక్కున వూశాడు హెడ్డు. అవున్నిజమే అన్నట్లు తల వూపాడు కానిస్టేబుల్.


"గాడెవడో గాడ్దినాకొడుకు ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కి షాక్ తగిలి చచ్చిండు. గాడి చావు మన చావుకొచ్చింది. ఆణ్ణి దింపి, గా ముచ్చట పంచనామా జర్పించి, శవాన్ని అప్పగించేవరకూ మనది కుక్క బతుకే."

"యస్సై సారింటికెళ్ళి బాసన్లు దోమినా, అమ్మగారికి కూరగాయలు దెచ్చిచ్చినా... గియన్నీ చేసినా మనమంటే దొరకెందుకో గుర్రు."

"సమర్ఘౌతలేదా... మనది ఆడ కులం కాదుగా. గదీ అసలు కారణం. నాక్కాని కాలిందా ఈడిమీద డిజిపికి పిటిషన్ పెడ్తా. నా కొడుక్కి నక్సలైట్ ఏరియాకి ట్రాన్స్‌ఫరైపోద్ది."

మాటల్లోనే అరుణోదయా అపార్ట్‌మెంట్స్ వచ్చేసింది. గిట్టుబాటు వ్యవహారం కాదనుకున్నాడు గానీ సెక్రెటరీలోని బెదురు, వంగి వంగి మాటలు చూడగానే ఎక్కడ నొక్కితే డబ్బులు రాల్తాయో అర్థమైపోయిందతనికి.

ఏం జరిగిందో సెక్రెటరీనుంచి రాబట్టాడు. కేస్ సజావుగా జరగడానికి ఎంత ఖర్చవుతుందో చెప్పాడు. అరగంట వరకూ లాగి, పీకి బేరమాడి ఒక అంకె దగ్గర బిగించి కట్టాక... అప్పుడు చూశాడు గబ్బిలంలా వేలాడుతున్న సాయన్న వైపు. "గిప్పుడు టైం ఐదు దాటింది. ఆడెప్పుడో సస్తే గింతసేపు శవాన్ని దింపకుండా ఏం సేస్తుండ్రు" అంటూ ఉరిమాడు హెడ్డు.



"యస్సై సారింటికెళ్ళి బాసన్లు దోమినా, అమ్మగారికి కూరగాయలు దెచ్చిచ్చినా... గియన్నీ చేసినా మనమంటే దొరకెందుకో గుర్రు."
"సమర్ఘౌతలేదా... మనది ఆడ కులం కాదుగా. గదీ అసలు కారణం. నాక్కాని కాలిందా ఈడిమీద డిజిపికి పిటిషన్ పెడ్తా. నా కొడుక్కి నక్సలైట్ ఏరియాకి ట్రాన్స్‌ఫరైపోద్ది."

"శవాన్ని దింపాలంటే ట్రాన్స్‌ఫార్మర్ ఎక్కాలి కదా. పవర్ ఆఫ్ చేయకుండా ఎవరెక్కుతారు? మీరే ఏదో ఒకటి చేయాలి" వీలైనంత నెమ్మదిగా సమాధానం చెప్పాడు.

"నాకేం ఎరుక... గిస్మంటివి చేయడానికి నేనేమైనా ఎలక్ట్రీషియన్నా? డిపార్టుమెంటుకి మళ్ళా ఫోన్ కొట్టు. యస్సై సారు చెప్పిండని చెప్పు. వినకపోతే ఆడి పై ఆఫీసర్‌కి కంప్లెయింట్ చేస్తానని చెప్పు."

★ ★ ★

ఆరింటికి జీపేసుకుని ఎలక్ట్రికల్ డిపార్ట్‌మెంట్ నుంచి ఒక ఎఇ, ఇద్దరు సిబ్బంది వచ్చారు.

సెక్రెటరీతో కొద్దిసేపు మాట్లాడి చిరిగిన బట్టలా కమ్మీల మీద వేలాడుతున్న సాయన్న వైపు సాలోచనగా చూసాడు ఇంజనీర్. "అన్ని వోల్టుల షాక్ తగిలాక బతకడం కష్టం. ఎప్పుడో చచ్చిపోయి ఉంటాడు" అన్నాడు.

"చచ్చిపోయాడని మాకు తెలీదా? దానికి నీ బోడి సర్టిఫికెట్ కావాలా" అనుకున్నాడు సెక్రెటరీ. "మీరు పవర్ ఆఫ్ చేయిస్తే శవాన్ని దింపుకుంటాం" అన్నాడు.

"నా పై అధికారికి రిపోర్టు చేయాలి" జీపు వచ్చినంత వేగంగా వెనుదిరిగి వెళ్ళిపోయింది.

శ్రీనివాస్‌కి ఓ మహత్తర కార్యాన్ని సాధిస్తున్నంత సంతృప్తిగా ఉంది. ఎప్పుడో ఓసారి సాయన్న శరీరంలో కుదుపొచ్చినపుడల్లా జూమ్‌లో చూస్తూ మురిసిపోతున్నాడు. మరణ ఘడియల్ని అంత క్లోజప్‌లో రికార్డుచేయటం ఓ రికార్డు అనుకుంటూ సంబరపడ్తున్నాడు.

★ ★ ★

వాచ్‌మన్ భార్య ఐలమ్మకు ఇదంతా దుస్సహంగా ఉంది. ఆమె వయసు నలభై పైనే ఉంటుంది. సన్నగా రివటలా ఉన్నా, కాయకష్టంతో కరకుదేలిన శరీరం...

తమ వూళ్ళో కరెంటు తీగలకు తగిలి మాడిపోయిన కాకుల్ని తను ఒకట్రెండుసార్లు చూసింది. సాయన్నను చూస్తే తీగలకు అంటుకుని తలకిందులుగా వేళ్ళాడుతున్న కాకి గుర్తొచ్చి గుండె బరువెక్కింది. సాయన్నను దింపే ప్రయత్నం ఎవ్వరూ చేయకపోవటం ఆమెకు వింతగా అన్పించింది. ఎవరో వచ్చి ఏదో చేస్తారని ఇక ఎదురు చూడకూడదనుకొంది. నెలక్రితం ఫ్లాట్లకి రంగులు పెలిసిపోయాయని కొత్తగా రంగులు వేశారు. అప్పుడు వాడిన నిచ్చెన గుర్తొచ్చి వేగంగా కదిలింది. నిచ్చెనని ట్రాన్స్‌ఫార్మర్‌కి ఆనించి, చీరని గోచీలా బిగించి ఎక్కింది.

"ఎక్కడికే... సస్తావే... కరెంట్ షాక్ కొట్టి సస్తావే" కింది నుంచి వాచ్‌మన్ లబోదిబోమన్నాడు.

"సావన్లే... నువ్వుండు".

ఆమె పైవరకూ వెళ్ళి ట్రాన్స్‌ఫార్మర్‌ని తాకకుండా నిలబడింది. చేయిచాపితే అందేంత దూరంలో సాయన్న శరీరం...

"ముట్టుకోకే... పెమాదం" పెద్దగా అరిచాడు వాచ్‌మన్.

ఆమెకూ భయమేసింది.

కిందకు దిగి తను వాడుకునే చెక్కపీట పట్టుకొచ్చి, మరలా పైకెక్కింది. పీట రెండడుగుల పొడవుంది. సాయన్న శరీరాన్ని నెట్టటానికి ప్రయత్నించింది. కమ్మీల సాయంతో వేలాడుతున్న సాయన్నని కిందికి నెట్టటం సులభమే. కానీ కింద పడి తల పగిల్తేనో...

"ఏదైనా పరుపుంటే ఏయండి. దెబ్బ తగలదు" అంది కిందికి చూస్తూ

"సచ్చిపోయినోడికి దెబ్బలేంటే... నెట్టు" అన్నాడు వాచ్‌మన్.

శ్రీనివాస్ మరింత ఉత్సాహంగా ఇదంతా రికార్డ్ చేస్తున్నాడు.

సెక్రెటరీ తన ఫ్లాట్‌లోని దూది పరుపు తెప్పించి, కింద చాప పరిచి, దాని మీద పరుపు వేయించి, దానిపైన పాత దుప్పటి కప్పించాడు.

ఐలమ్మ బలంగా సాయన్న శరీరాన్ని పీటతో నెట్టింది.

దబ్బున శరీరం పరుపుమీద పడింది.

అందరూ ఒక్కసారిగా దగ్గరకు పరుగెత్తారు. సాయన్న భార్య మరోసారి ఓరయ్యో అంటూ శోకాలు పెట్టింది.

హెడ్డు సాయన్న ముక్కు దగ్గర వేలుంచి శ్వాస ఆడ్తుందో లేదో తెలుసుకోడానికి ప్రయత్నించాడు. ఏమీ తెలీలేదు. ఛాతీ మీద చేయి పెట్టి ఓ నిమిషం గమనించాక "పాపం పోలా... ఈడు బతికే ఉన్నాడు. అంబులెన్స్‌కి ఫోన్ చేయండ్రి" అంటూ పెద్దగా కేకపెట్టాడు.

అరగంటకు అంబులెన్స్ వచ్చింది. సాయన్న శరీరాన్ని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్నప్పుడు అతనిలో కొన ప్రాణముంది. సగం దూరం పోయేప్పటికి అతను చచ్చిపోయాడు.

శ్రీనివాస్ రికార్డింగ్ ఆపేసి క్యాసెట్‌ని భద్రంగా బీరువాలో దాచిపెట్టాడు.

సాంబమూర్తి మూడు పెగ్గుల మందుకొట్టి, శ్యామలతో కల్సి చికెన్ బిర్యాని మీద కలియబడ్తున్నాడు.

అనుకోకుండా వచ్చిన ఖర్చుని ఎలా పూడ్చుకోవాలా అని సెక్రెటరీ ఆలోచిస్తున్నాడు.

దహన సంస్కారాలకయ్యే ఖర్చయితే ఇచ్చాడుగాని మాటిచ్చిన ప్రకారం ముప్పయివేలు ఇస్తాడో ఇవ్వడో అని దిగులు పడుతోంది సాయన్న భార్య 'ఆ సమయంలో పక్కనెవరూ లేరు. నేనా మాట అననే లేదంటే దిక్కేంటి? సాక్షులు కూడా లేరే' అనే ఆలోచన ఆమెని దహిస్తూ...

'నేను చేసిన పని మూడుగంటల ముందే చేసి ఉంటే సాయన్న బతికేవాడు కదా' ఐలమ్మలో సుళ్ళు తిరుగుతూ విచారం... మనసుని కుళ్ళబొడుస్తూ అపరాధ భావన...

★